అక్రమ పార్కింగ్‌పై చర్యలకు వినతి



కార్పొరేటర్ లచ్చిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: కాలనీకి వెళ్లకుండా రోడ్డుపై అక్రమ పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వెంటనే అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలని బాలాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలోని సౌత్ ఈస్ట్ బేకరీ వద్ద ఉన్న కాలనీ ప్రధాన రహదారిపై వాహనాదారులు అక్రమ పార్కింగ్ చేయడంతో కాలనీ రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. సమీపంలోని వైన్స్‌కు వచ్చేవారు కూడా ఇదే రోడ్డుపైన పార్కింగ్ చేయడం, ఆటోలు, ద్విచక్రవాహనదారులు ఇష్టానుసారంగా నిలుపుతుండటంతో సమస్య ఉత్పన్నమవుతోందని కార్పొరేటర్‌కు వివరించారు. అక్రమ పార్కింగ్ విషయంపై పలుమార్లు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. అక్రమ పార్కింగ్ విషయంలో ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో సందీప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణాగౌడ్, అశోక్‌కుమార్, సత్యనారాయణ ఉన్నారు.

వైద్య విద్యార్థులకు శాపంగా 'స్థానికత'

పీడీఎస్‌యూ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

మలక్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న '4 ఏళ్ల స్థానికత' తెలంగాణ వైద్య విద్యార్థులకు శాపంగా మారుతుందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆరోపించారు. దిల్‌సుఖ్‌నగర్ న్యూనోబుల్ డిగ్రీ కాలేజీలో జరిగిన గ్రేటర్ హైదరాబాద్ కమిటీ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 9,10, తరగతి తెలంగాణలో చదువుకుని ఇంటర్ ఆంధ్రప్రదేశ్‌లో చదువుతున్న తెలంగాణ విద్యార్థులు వారి స్థానికతను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు తెలంగాణలో చదువుకుంటున్న ఇతర రాష్ట్రాల విద్యార్థులకు స్థానికత దక్కడంతో కటాఫ్ పెరిగి తెలంగాణ విద్యార్థులు సీట్లు కోల్పోయే పరిస్థితి ఎదురవుతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు, ప్రైవేట్ కాలేజీలకు లాభం చేకూర్చేలా ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు గణేష్, సుమన్, ధరణి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి మెరుగైన వసతులు కల్పించాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పాఠశాలలోని బోరుబావి ఎండిపోవడంతో నీరులేక మూత్రశాలలు కంపుకొడుతున్నాయని, జలమండలి అధికారులు తాత్కాలికంగా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. నూతన బోర్‌వెల్ కోసం ఉన్నతాధికారులు చొరవ చూపాలన్నారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఉపాధ్యాయులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయులు రామలింగం, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, సాయిరాంగౌడ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడుతున్న డీసీ సుజాత

నాగోలు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ సుజాత, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మంగళవారం కొత్తపేట డివిజన్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల సందర్శించారు. రెండు రోజులుగా అన్నంలో పురుగులు వస్తున్నాయని ఈ విషయాన్ని ఉపాధ్యాయులతో పాటు నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇద్దరు విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కూడా అయిందని విద్యార్థులు డీసీ దృష్టికి తీసుకెళ్లారు. మరోసారి ఇలాంటి ఘటన పునరావృతం అయితే బాధ్యులపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా డీసీ హెచ్చరించారు.

వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి



నాగోలు: వీధి కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత అన్నారు. మంగళవారం సత్యనగర్‌కాలనీ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఆమెతో పాటు స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీ సుజాత మాట్లాడుతూ.. కుక్కలు వెంట పడుతున్నప్పుడు పరిగెత్తకూడదని వాటిని రాళ్లతో కొట్టరాదన్నారు. అవి తింటున్నప్పుడు వాటిని భంగం కలిగించడం లాంటివి చేస్తే అవి దాడులకు తెగబడుతాయన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో ఉన్నటువంటి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని చిన్నపిల్లలను బయటకు పంపవద్దని వాటికి తిండి పెట్టడం లాంటివి చేయకూడదన్నారు. కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంటే జీహెచ్‌ఎంసీ అధికారులు, లేదా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంటి చుట్టూ పరిసర ప్రాంతంలో శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ రంజిత్, పీఓ విక్రాంత్ రెడ్డి, శానిటైజేషన్ డీఈ నీలిమ, సహదేవ్, ప్రేమ్, సత్యనగర్ కాలనీ సెక్రటరీ రమణ, రవీందర్ రావు, శివరాజ్ పాటిల్, నాయకులు మంచి రాజేష్, గట్టు మహేష్ పాల్గొన్నారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యం



నిర్మల



విద్యాస్

నాగోలు: భర్తతో ఫోన్‌లో జరిగిన స్వల్ప వాగ్వాదంతో ఓ మహిళ కుమారుడిని తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ ఎస్‌బీహెచ్‌కాలనీలో గుగులోత్ బొందేష్, భార్య నిర్మల, కుమారుడు విద్యాస్‌తో కలిసిఉంటున్నాడు. ఈ నెల 5న దంపతుల నడుమ ఫోన్‌లో వాగ్వాదం చోటు చేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి నిర్మల (27) విద్యాస్(4) కనిపించలేదు. ఆమెకు ఫోన్ చేస్తే స్విచ్ఛాప్ వచ్చింది. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో బొందేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దోమలను నిర్మూలిద్దాం

స్వచ్ఛదనం- పచ్చదనంలో రెండోరోజు అవగాహన కార్యక్రమాలు



ఊర్మిళానగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

ఎల్‌బీనగర్: స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు నాగోలు, మన్సూరాబాద్, బీఎన్‌రెడ్డినగర్, సరూర్‌నగర్ చైతన్యపురి డివిజన్లలో ప్రజలకు దోమల నివారణ, కుక్కకాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పలు కాలనీలో అధికారులు పర్యటించి ఇంట్లో ఉండే తొట్లల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించే విధానంతో పాటు కాలనీలోని రోడ్లపై వర్షం నీటి నిల్వ ఉండే ప్రాంతాలపై దృష్టి సారించి కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీసీ యాదయ్య మాట్లాడుతూ.. సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మన్సూరాబాద్ పాఠశాలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని దోమలతో వ్యాపించే డెంగీ, మలేరియా, చికన్‌గున్యా వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు దివ్వజ్యోతి, రంజిత్, లావణ్య, బలరాం, యాదగిరి, మేధా, రవీంద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ పార్కులో..

మలక్‌పేట: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని మూసారంబాగ్ కార్పొరేటర్ భొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ పార్కులో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమానికి ఆమె హాజరై కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..పచ్చదనంతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఎంసీ మురళీ, యూబీడీ సూపర్‌వైజర్ కృష్ణ, శానిటేషన్ జవాన్ రమేష్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ గుండప్ప పాల్గొన్నారు.

మన్సూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

మన్సూరాబాద్: దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. నాగోలు డివిజన్ పరిధి మన్సూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దోమలతో విజృంభించే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమంలో భాగంగా దోమలతో సంభవించే వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు నివారణ చర్యల గురించి వివరించారు.

హస్తినాపురం డివిజన్‌లో..

హస్తినాపురం: వీధి కుక్కల కారణంగా ప్రజలు ఇంట్లో నుంచి బయటికి వెళ్లాలంటేనే జంకుతున్నారని కుక్కకాటుకు గురికాకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా రెండవ రోజు దోమల నివారణ, కుక్కలపట్ల జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దోమల నివారణకు పూల మొక్కల తొట్లలో నీటి నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ జకియా సుల్తానా, శానిటేషన్ డీఈ వెంకటేశ్, ఊర్మిళానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారినగర్‌లో..

లింగోజిగూడ: దోమల నివారణకు ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం డివిజన్ పరిధిలోని అధికారినగర్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలనీల్లో ఎక్కడ కూడా నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. కుక్కల బెడద ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ జాకీయ సుల్తాన, డీఈ వెంకటేశం, ఏఈ మనెమ్మ, సిబ్బంది సత్యనారాయణ, అశ్విని, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కుక్కకాటు నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



దోమలతో వచ్చే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీసీ యాదయ్య

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.27, వంకాయ రూ.35, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.55, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.23, క్యారెట్ రూ.35, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.37, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.15, సొరకాయ రూ13, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.70, అర్వి రూ.40, మునగ రూ.40, చిలుకడ దుంప రూ.45, బీట్‌రూట్ రూ.28, కీర రూ.25, బీన్స్ రూ.60, క్యాప్సికమ్ రూ.45. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

అంధ బాలిక అత్యాచార ఘటనపై చర్యలేవి?



చొక్కారావు

చాదర్‌ఘాట్: మలక్‌పేట ప్రభుత్వ హాస్టల్‌లో అంధ బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై ఏర్పాటు చేసిన కమిటీ ఏం చర్యలు తీసుకుందని డ్వాబ్ సంస్థ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంధ బాలికల హాస్టల్‌లో 24 గంటలు మహిళ అధికారి పర్యవేక్షణ ఏర్పాటు చేయాలన్నారు. అంధ బాలికల పాఠశాల విద్యాశాఖ పరిధి, హాస్టల్ సంక్షేమశాఖ పరిధిలో ఉండటంతో గందరగోళ పరిస్థితులు ఉన్నాయని రెండింటిని ఒకే శాఖ పరిధిలోకి తీసుకురావాలని కోరారు.

బస్సు ఢీకొని మహిళ మృతి

చంచల్‌గూడ: బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ మహిళ మృత్యువాత పడిన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. మంగళవారం బాలాపూర్ చెందిన రిటైర్డ్ ఏఎస్‌ఐ ఖాజానసీరుద్దీన్ తన భార్య హిదాయత్ బేగం(60)తో కలిసి సైదాబాద్ మీదుగా యాక్టీవాపై వెళ్తుండగా పికెట్ డిపోకు చెందిన బస్సు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయారు. బస్సు వెనుక చక్రాలు హిదాయత్ బేగం పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ ప్రభాకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

మూర్ఛతో పడిపోయిన యువకుడి సెల్‌ఫోన్ చోరీ

అరగంటలో పట్టుకున్న ట్రాఫిక్ పోలీసులు



యువకుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటేష్‌నాయక్, 108 సిబ్బంది

మలక్‌పేట: మూర్ఛతో రోడ్డుపై పడిపోయిన ఓ యువకుడి బ్యాగులో నుంచి ఓ ఆటో డ్రైవర్ సెల్‌ఫోన్ చోరీ చేసిన ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారం క్రాస్‌రోడ్‌లో ఓ యువకుడు మూర్ఛతో కింద పడిపోయాడు. స్థానికులు సమాచారంతో అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాసేటి తర్వాత తేరుకున్న యువకుడు తన సెల్‌ఫోన్ పోయిందని, అక్కడే విధుల్లో ఉన్న మలక్‌పేట ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటేష్‌నాయక్‌కు తెలుపగా ఆర్‌ఎస్ బ్రదర్ షోరూమ్‌లోని సీసీ ఫుటేజీ పరిశీలించారు. ఓ వ్యక్తి బ్యాగులో నుంచి ఫోన్ తీసుకుని ప్యాసింజర్ ఆటోలో వెళ్లినట్లు గుర్తించాడు. స్థానిక ఆటోడ్రైవర్లతో ఆరా తీసి దొంగతనం చేసిన ఆటో డ్రైవర్‌ను పట్టుకున్నారు. యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. సకాలంలో స్పందించి సెల్‌ఫోన్ పట్టుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటేష్ నాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌ను స్థానికులు అభినందించారు. మూర్ఛతో పడిపోయిన యువకుడు ఆదిలాబాద్ జిల్లా గొలేటి గ్రామానికి చెందిన ఎలగతి వెంకటేష్‌గా గుర్తించారు.

బీసీల సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మన్సూరాబాద్: ఈ నెల 10న ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న బీసీల సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయాలని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఎల్‌బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావుఫూలే విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ హామీలైన సమగ్ర కులగణన చేపట్టాలని కోరారు. బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో బీసీ సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజారామ్‌యాదవ్, సిద్దేశ్వర్, కేవీగౌడ్, కొండల్‌గౌడ్, గోర శ్యాంసుందర్‌గౌడ్, మారోజు రామాచారి, సల్వాచారి, బొంగు వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థి ఉన్నత విద్యకు ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న ఉపేందర్‌గుప్తా

సైదాబాద్: పేద విద్యార్థులకు పుల్లూరి అనంతలక్ష్మి ఫౌండేషన్ చేయూతనందిస్తోందని చైర్మన్ పుల్లూరి ఉపేందర్‌గుప్తా తెలిపారు. పాతబస్తీ ఉప్పుగూడకు చెందిన టైలర్ ఆదం రమేష్ కుమారుడు ఆదం నీలేష్ ఎంసెట్‌లో మంచి ర్యాంక్ సాధించి ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్‌లో సీటు సాధించాడు. అయితే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న ఫౌండేషన్ చైర్మన్ మంగళవారం విద్యార్థికి రూ. 15 వేలు చెక్కు అందించారు. తన విద్యకు సహకరించిన పుల్లూరి అనంతలక్ష్మి ఫౌండేషన్‌కు విద్యార్థి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: డివిజన్‌లో నెలకొన్న సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గ్రీన్‌పార్క్ కాలనీలోని డ్రైనేజీ సమస్యపై స్థానికులు ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. సమస్య పరిష్కారానికి వెంటనే నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జగన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

మా కుమారుడి ఆచూకీ కనుగొనండి సారూ!

15 రోజులైనా దొరకని బీటెక్ విద్యార్థి



సాయికిరణ్

హయత్‌నగర్: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమై 15 రోజులైనా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు ఆనుకుని ఉన్న ఎల్‌ఐసీ కాలనీకి చెందిన సాయికిరణ్ (24) బీటెక్ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. గత నెల 23న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన సాయికిరణ్ ఎంతకీ ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఇంటి వద్దే వదిలేసి వెళ్లాడు. అతని ఫోన్‌లోని వివరాలపై ఆరా తీయగా అతని బ్యాంక్ ఖాతా నుంచి పలు ప్రాంతాలకు నగదు ట్రాన్స్‌ఫర్ జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. సాయికిరణ్ సైబర్ మోసానికి గురై ఉంటాడని భావిస్తున్నారు. తమ కుమారుడు తప్పిపోయి రెండు వారాలు గడుస్తున్నా వివరాలు తెలియడం లేదని తమ కుమారుడి ఆచూకీ కనుగొనాలని పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. సాయికిరణ్ ఇక్కడి నుంచి నేరుగా విజయవాడ వెళ్లినట్లు తెలిసిందని ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాడో తెలుసుకుంటున్నామని ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

వ్యర్థాల తరలింపు

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్‌లో పారిశుద్ధ్యంపై శానిటేషన్ విభాగం అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వ క్వార్టర్స్, ఆంధ్రాకాలనీలలో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తకుప్పలు, మట్టిని తరలించారు. శానిటేషన్ విభాగం డీఈ వెంకటాచలపతి, సూపర్‌వైజర్ గోవింద్‌రెడ్డి పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చెత్త కుప్పలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

సైదాబాద్: గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన సైదాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 1న రాత్రి 8 గంటల సమయంలో శంకేశ్వరబజార్ రహదారి పక్కన ఓ వృద్ధురాలు పడిపోయి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఆలేటి ఆశ్రమానికి తరలించగా శనివారం మృతి చెందింది. మృతి చెందిన వృద్ధురాలి పేరు ఈశ్వరమ్మ అని సంబంధీకులు ఉంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. నారాయణగూడ ప్రాంతానికి అనిత అనారోగ్య సమస్యలతో చికిత్స పొంది సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా ఆమెకు మంజూరైన రూ.60 వేల చెక్కు మంగళవారం ఉప్పల శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద కుటుంబాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు.

అత్తింటి వేధింపులకు గృహిణి బలి

మృతురాలు నాలుగు నెలల గర్భిణి



శ్రీలత (ఫైల్)

మీర్‌పేట: అదనపు కట్నం వేధింపులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు వివరాల ప్రకారం.. నగరంలోని జియాగూడకు చెందిన మధురవేణి, రమేశ్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు శ్రీలత (26)ను 2021లో సైదాబాద్ నివాసి, ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా పనిచేసే మామిడి సాయిభార్గవకృష్ణకు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఏడాదిన్నర చిన్నారి శాన్వి ఉంది. రెండు నెలలుగా బడంగ్‌పేట గాయత్రిహిల్స్‌లో సొంతిల్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్త, అత్త కలిసి శ్రీలతను వేధిస్తున్నారు. మనస్తాపం చెందిన ఆమె సోమవారం సాయంత్రం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. తమ కూతురు ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి అని, అదనపు కట్నం వేధింపులతోనే ఆత్మహత్య చేసుకుందని తల్లి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

ప్రొ.జయశంకర్ సిద్ధాంతం.. అందరికీ ఆదర్శం



వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు



హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీసీ యాదయ్య

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మంగళవారం ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతం అందరికీ ఆదర్శమని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చేసిన ఉద్యమాలు మరువలేనివన్నారు. ఆయన ఆశయ సాధనలో అందరూ కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు.

–ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



నాగోలు ఆర్టీఓ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



చంపాపేటలో జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, ఉద్యమకారులు